క్లుప్తంగా

పీహెచ్‌సీ వైద్యాధికారిగా మీనాజ్ అహ్మద్



ఆత్మకూర్: మండలంలోని తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్ మీనాజ్ అహ్మద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆత్మకూర్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న ఆయన డిప్యూటేషన్‌పై తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది డాక్టర్‌ను శాలువాతో సత్కరించారు.

ఎంపీడీఓగా శ్రీపాద్



ఆత్మకూర్: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా శ్రీపాద్ గురువారం విధుల్లో చేరారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న సుజాత పదవి విరమణ అనంతరం ఎంపీఓ శ్రీరాంరెడ్డి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కొనసాగుతున్నారు. మహబూబ్‌నగర్ ఏపీడీగా విధులు నిర్వహిస్తున్న శ్రీపాద్‌ను ఆత్మకూర్ ఎంపీడీఓగా బదిలీ చేశారు. గతంలోనూ శ్రీపాద్ ఆత్మకూర్‌లో ఎంపీడీఓగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీపాద్‌ను సిబ్బంది శాలువాతో సన్మానించారు.

తాగునీటి వృథా



వనపర్తి రూరల్: మండలంలోని రాజపేట శివారులోని దాబా వద్ద ప్రధాన రహదారి పక్కన మిషన్ భగీరథ పైపులైన్ వాల్ లీకేజీ అయి తాగునీరు వృథాగా పోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి మెయిన్ వాల్ లీకేజీకి మరమ్మతు చేసి తాగునీటిని వృథాను అరికట్టాలని కోరారు.

ముగ్గురిపై కేసు నమోదు

పాన్‌గల్: ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో గురువారం ముగ్గురిపై కేసు నమోదైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆది గోపిచంద్ ఈనెల 11వ తేదీన గ్రామంలోని వైన్ షాపు ఎదురుగా ఉన్న ఓ హోటల్‌లో భోజనం చేయడానికి వెళ్లాడు. ఇదే గ్రామానికి చెందిన సోదరుడు ఆది శ్రీనివాస్ హమాలీ విషయంలో పాత కక్షలు మనసులో పెట్టుకొని.. అతడితో పాటు ఆది పవన్, బండి తిరుమలేష్ ముగ్గురు కలిసి మద్యం మత్తులో బూతులు తిడుతూ కాళ్లు, చేతులు, ఇటుకలతో ఆది గోపిచంద్‌పై దాడి చేసి గాయపర్చారు. దాడి చేయడమే కాకుండా చంపుతామని బెదిరించిన ముగ్గురితో తనకు ప్రాణహాని ఉందని గోపిచంద్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆది శ్రీనివాస్, ఆది పవన్, బండి తిరుమలేష్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్, కారు ఢీ: ఇద్దరికి గాయాలు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లికి చెందిన ఇనుపునూరి హేమవర్ధన్, తన చిన్నాన్న కూతురైన సహర్షతో కలిసి ముమ్మళ్లపల్లిలో బంధువుల పెళ్లికి బైక్‌పై వెళ్లి.. తిరిగి సాయంత్రం స్వగ్రామానికి వెళ్తుండగా కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు డ్రైవర్ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న హేమవర్ధన్, సహర్ష కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

రేషన్ బియ్యం నిల్వ చేసిన వ్యక్తిపై కేసు

ఖిల్లాఘనపురం: రేషన్ బియ్యం సేకరించి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని సోళీపురం గ్రామానికి చెందిన తీనేటి సాయికుమార్‌రెడ్డి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారన్న సమాచారంతో సివిల్ సప్లయి ఉప తహసీల్దార్ దుబ్బాక పరమేష్ ఈ నెల 12న గ్రామానికి వచ్చి పరిశీలించారు. తీనేటి సాయికుమార్‌రెడ్డి గ్రామంలోని రేషన్ కార్డుదారుల నుంచి బియ్యాన్ని కిలో రూ.10 కి కొనుగోలు చేసి.. 26 సంచుల్లో 9 క్వింటాళ్ల బియ్యం నిల్వ చేయడంతో అధికారులు పంచనామా నిర్వహించి సీజ్ చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని వనపర్తి స్టాక్ పాయింట్‌కు తరలించారు. దుబ్బాక పరమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తికి జైలుశిక్ష

గోపాల్‌పేట: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్‌కుమార్ హెచ్చరించారు. గోపాల్‌పేట మండలానికి చెందిన ఓ వ్యక్తి డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ ఇటీవల పోలీసులకు దొరికాడు. అతడిని గురువారం కోర్టులో హాజరు పర్చగా.. జడ్జి ఆరు రోజులు జైలుశిక్ష విధించారని పేర్కొన్నారు.

నిషేధం అమలయ్యేనా?

- రోజురోజుకు పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం
- తూతూమంత్రంగా అధికారుల దాడులు



కవర్లలో కూరగాయలు తీసుకెళ్తున్న వినియోగదారుడు



బేకరీలో ప్లాస్టిక్ కవర్లలో బ్రెడ్లు, ఇతర ఆహార పదార్థాలు

కొత్తకోట రూరల్: ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరిపోతుంది. ఏ వస్తువు కొనుగోలు చేసినా ప్లాస్టిక్ కవర్లో తీసుకెళ్లడం ఈ రోజుల్లో సర్వసాధారనమైంది. గతంలో కొన్నాళ్లు జనపనార, బట్ట, కాగితపు సంచుల వినియోగంపై అవగాహన కల్పించిన అధికారులు తర్వాత దాని గురించే ఆలోచించడం వదిలేశారు. ప్రస్తుతం కూరగాయలు, కిరాణా సామగ్రి, బట్టలు మొదలుకుని తినే ఆహార పదార్థాలు సైతం ప్లాస్టిక్ బ్యాగుల్లోనే తీసుకెళ్తున్నారు. దీంతో పర్యావరణం దెబ్బతినడంతో పాటు అనారోగ్య సమస్యలు కూడా ఏర్పడతాయని వైద్యులు చెబుతున్నారు. గతంలో ఇంట్లో ఏమైనా శుభకార్యాలు జరిగితే ఇస్తరాకులు (మోదుగ చెట్ల ఆకులు) వాడేవారు. ప్రస్తుతం ట్రెండ్ మారింది.. ఏ చిన్న ఫంక్షన్ జరిగినా ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులే వినియోగిస్తున్నారు.

భవిష్యత్‌లో సమస్యలు

ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ఉండటంతో ఎక్కడ చెత్తకుప్ప ఉన్నా అందులో అధికంగా ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. ప్రతీరోజు టన్నుల కొద్ది ప్లాస్టిక్ వినియోగం జరుగుతుండడంతో భూమి కలుషితమై కాలుష్యం పెరిగిపోతోంది. దీని పర్యావసానంగా వర్షాలు సమృద్ధిగా కురిసినా.. భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. ప్లాస్టిక్ వాడకం వలన క్యాన్సర్‌తో పాటు 32రకాల రోగాలు వస్తున్నట్టు డాక్టర్లు చెబుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

పట్టణ కేంద్రంలో దాదాపు అన్ని షాపుల్లో, కూరగాయల దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను యథేచ్ఛగా వాడుతున్నారు. మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎప్పుడో ఒకసారి తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి నామమాత్రపు జరిమానాలు విధించి చేతులు దులిపేసుకుంటున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించకపోతే రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని పర్యావరణ ప్రేమికులు, పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రజల్లో మార్పు రావాలి



ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వాడకంపై ప్రజల్లో మార్పు రావాలి. అప్పుడే ప్లాస్టిక్ నియంత్రం సాధ్యమవుతుంది. ఆ దిశగా అధికారులు, పర్యావరణ ప్రేమికులు, పౌరసమాజం కృషి చేయాలి.

– గోపాల్, ఉపాధ్యాయుడు, పామాపురం జెడ్పీహెచ్ఎస్

పర్యావరణం దెబ్బతింటోంది



పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం హరితహారంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నారు. కానీ చాపకింద నీరులా ప్లాస్టిక్ మహమ్మారి పర్యావరణాన్ని నాశనం చేస్తుంది. ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చినప్పుడే ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుంది.

– ఎన్‌జే బోయేజ్, రాజకీయ నాయకులు

క్యాన్సర్ ముప్పు..



ప్లాస్టిక్ కవర్లలో ఉండే వస్తువులను వాడటం వలన ప్రాణాంతకమైన క్యాన్సర్‌తో పాటు మరెన్నో రోగాలు సంభవించే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు నిలిపిస్తే తప్ప రోగాల నుంచి బయటపడే అవకాశం ఉండదు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చిన ప్రజల్లో మార్పు వస్తేనే సాధ్యమవుతుంది.

– డాక్టర్ శ్రీనివాసులు, పీహెచ్‌సీ, అప్పరాల

‘రేడియాలజిస్ట్‌ను నియమించాలి’



రిలేదీక్షలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రం శివారులోని మాత, శిశు సంరక్షణ కేంద్రంలో (ఎంసీహెచ్) రేడియాలజిస్టును వెంటనే నియమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి కోరారు. గురువారం ఎంసీహెచ్ ఎదుట ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరింది. దీక్షకు ప్రజా సంఘాల నాయకులు బాల్‌రెడ్డి, రాజు, సునీత, కృష్ణయ్య, మహేష్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంసీహెచ్‌లో గర్భిణులు స్కానింగ్ చేయించుకోవడానికి రేడియాలజిస్ట్ డాక్టర్ లేకపోవడంతో ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రేడియాలజిస్టు డాక్టర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సాయిలీల, కవిత, ఉమ, శాంతమ్మ, రేణుక, పార్వతి, మనెమ్మ, పద్మ, రజిత పాల్గొన్నారు.

కొనసాగుతున్న మధుమేహ పరీక్షలు



కేతేపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: మండలంలో షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న పరీక్షలు కొనసాగుతున్నట్లు పీహెచ్‌పీ డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న పరీక్షలపై ఆయన సిబ్బందితో ఆరా తీశారు. 30 ఏళ్లు పైబడిన వారందరికీ పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. షుగర్ పరీక్షలు చేయించుకోవడంతో ఆరోగ్య పరిస్థితులు తెలిసి దానికి అనుగుణంగా జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. వైద్య సిబ్బందికి అందరూ సహకరించి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో 1,125 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

రూ.2.30 లక్షల విరాళం



ఆత్మకూర్: సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ జరుగుతుందని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ నరేందర్ అన్నారు. గురువారం మండలంలోని తిప్పుడంపల్లి, జూరాల గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తిప్పుడంపల్లి గ్రామస్తులు రూ.2.30 లక్షలు, జూరాల గ్రామస్తులు రూ.30 వేలు సమకూర్చి ఎస్‌ఐకు అందజేశారు.

భవననిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

ఆత్మకూర్: భవన నిర్మాణ రంగ కార్మికులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి హనుమంతు, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, కోశాధికారి రాజు అన్నారు. గురువారం మండలంలోని జూరాలలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల మహాసభలను నిర్వహించారు. కార్మికులకు అనేక పథకాలు అందుబాటులో ఉన్నా అమలుకు నోచుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రసూతి సాయాన్ని రూ.లక్షకు పెంచాలని, సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాద మరణానికి రూ.10లక్షలు, కార్మికుడికి రూ. 5వేలు పెన్షన్‌ను, రూ. 5లక్షలు రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా చెన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా కొండన్న, ఉపాధ్యక్షుడిగా అంజి, సహకార్యదర్శిగా రామాంజి, కోశాధికారిగా వెంకటన్న, కాశీం, దస్తగిరి, రాజు, బాలకృష్ణ ను కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్ట శివారులో గల వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. గురువారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లకు కనిమెట్ట సమీపంలోని ఫుడ్ పిరమిడ్ రెస్టారెంట్ పక్క నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న టిప్పర్ తారసపడగా.. ఆపి తనిఖీలు తనిఖీలు చేశారు. ఇసుక రవాణాకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు. మండలంలో ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు..

వనపర్తి రూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం పట్టుకుని కేసు నమోదు చేశామని రూరల్ ఎస్‌ఐ బాలయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిట్యాల శివారులోని వాగు నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను చిట్యాల చౌరస్తా వద్ద పెట్రోలింగ్ పోలీసులు ఆపారు. వారు అనుమతి పత్రాలు చూపకపోవడంతో రెండు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి.. ట్రాక్టర్ డ్రైవర్ కమ్ ఓనర్ నరేష్, యాదగిరిపై కేసు నమోదు చేశామన్నారు.

వృద్ధుడి అదృశ్యం

కొత్తకోట రూరల్: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన చంద్రమౌళి (73) పెబ్బేరుకు వెళ్లి కంటి మందు తెచ్చుకుంటానని భార్య అలివేలమ్మతో చెప్పి ఈ నెల 3న ఇంటి నుంచి వెళ్లాడు. కానీ నేటి వరకు ఇంటికి రాలేదు. బంధువుల దగ్గర, చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా చంద్రమౌళి ఆచూకీ లభించకపోవడంతో గురువారం చంద్రమౌళి కుమారుడు నర్సింహ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

పెబ్బేరు రూరల్: స్థానిక తెలంగాణ మోడల్ పాఠశాల విద్యార్థులకు గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు శ్వేత, సునీల్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి చూపులో సమస్య ఉన్నవారికి అద్దాలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ పెబ్బేరు మండలంతో పాటు శ్రీరంగాపూర్ గ్రామాల్లోని 9, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు చేయగా కంటి సమస్యలున్న 55 మంది విద్యార్థులకు మొదటి విడతగా కంటి అద్దాలు అందించామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరేష్, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఫార్మాసిస్ట్ అనురాధ, ఏఎన్‌ఎం ప్రశాంతి పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ బస్సును పునరుద్ధరించండి

మదనాపురం: మండలంలోని దుప్పల్లి, కొత్తపల్లి మీదుగా ప్రతిరోజు మధ్యాహ్నం వేళల్లో ఆత్మకూర్‌కు వెళ్లే షాద్‌నగర్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సును అధికారులు రద్దు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు బస్సు సౌకర్యం లేకపోవడంతో కొత్తకోట తదితర ప్రాంతాల మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్సును పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భవానీమాత ఆలయంలో పూజలు



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని భవానీ శంకర దేవాలయంలో ఇటీవల ధ్వజస్తంభ, గోపురం ప్రతిష్ఠాపన కనులపండువగా జరిగింది. ఆలయ నిర్వాహకుల ఆహ్వానం మేరకు చేవెళ్ల ఏసీపీ బంటు కిషన్ గురువారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఏసీపీకి ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాగాకు రాఘవేంద్రప్రసాద్, బీమ కిషోర్‌కుమార్, వేణుయాదవ్, శ్రీనివాస్‌జీ, రాజశేఖర్, నరేష్‌సాగర్ తదితరులు ఉన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆంగ్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈమేరకు విద్యార్థులకు ఆంగ్ల భాషా ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మౌలానా, ఉపాధ్యాయులు రాజశేఖర్, సీఆర్పీ స్వామి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి



ఎస్‌ఐని కలిసిన బీజేపీ నాయకులు

కొత్తకోట రూరల్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని పెద్దమందడి ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెల్టూర్‌లో గ్రామస్తులు, దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వెల్టూర్ గ్రామం నిఘా నీడలో పనిచేస్తుందని, గ్రామం నుంచి ప్రధాన ప్రధాన జాతీయ రహదారి ఎన్‌హెచ్44 వరకు మూడు కిలోమీటర్ల మేర సీసీ కెమెరాలు పనిచేయనున్నాయి. గతంలో సీసీ కెమెరాలు లాంఛనంగా ప్రారంభించినప్పటికీ కొన్ని రోజులు మాత్రమే పని చేశాయని, నిర్వహణ లోపం కారణంగా అవి పనిచేయకపోవడంతో గ్రామంలో అప్పుడప్పుడు దొంగతనాలు జరుగుతుండడంతో తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆరు కెమెరాలను రిపేర్ చేయడంతో పాటు అవసరం ఉన్న చోట కొత్త కెమెరాలు అమర్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. సీసీ కెమెరాలు అన్నింటిని అనుసంధానంగా ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్‌కు లింక్ చేశామన్నారు. గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గుర్తించే వెసులుబాటు ఉంటుందన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

శాంతిభద్రతల పరిరక్షణకు మండల ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి కోరారు. బీజేపీ పెద్దమందడి మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో దత్తాత్రేయరెడ్డి, కావలి అశోక్, మదిగట్ల రవి, కొత్తబోయ బాలరాజు, అనిల్‌యాదవ్, నాగరాజుయాదవ్, కరుణాకర్, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కవయిత్రి సరోజినినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా చెలిమి సంస్థ అధ్యక్షుడు రవి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మహిళా ఉపాధ్యాయిని రుద్రమదేవి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ వెంకటమ్మను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో సరోజినినాయుడు పాత్రను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిరాజాచారి, వెంకటేశ్వరగుప్తా, సంజీవయ్య, వరదాచారి, మహమ్మద్ షఫీ, పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశాల ఊరేగింపు



కోలాటాలు, నృత్య ప్రదర్శనలో మహిళలు,



ఆలయ గోపుర కలశాలతో భక్తులు

కొత్తకోట: మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీకృష్ణ పరమాత్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా గురువారం భక్తిశ్రద్ధలతో భక్తులు ర్యాలీ నిర్వహించారు. ఉత్సవాల మొదటి రోజులో భాగంగా శ్రీకృష్ణ గోపుర కలశాలను ఊరేగింపుగా కొత్తకోటలోని రాఘవేంద్రస్వామి ఆలయం నుంచి శ్రీకృష్ణ ఆలయం వరకు పురవీధుల గుండా మహిళలు కోలాటాలు, చిన్నారుల నృత్యాలతో ఊరేగింపు కొనసాగించారు. మూడు రోజుల పాటు నిర్వహించే శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలకు హిందువులందరూ హాజరై విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు సమకూర్చడంతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నామని నిర్వాహకులు తెలిపారు.

అర్హులందరికీ రైతు రుణమాఫీ చేయాలి



ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖిల్లాఘనపురం: అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని కోరుతూ గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చేరుకున్న బీఆర్‌ఎస్ నాయకులు బస్టాండు వద్ద ప్రధాన రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదన్నారు.

‘జిల్లాలో కళాకారులకు కొదవలేదు’



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న సాహితీ కళావేదిక ప్రతినిధులు

వనపర్తి టౌన్: వనపర్తిలో కవులు, కళాకారులకు కొదవ లేదని సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. రాష్ట్రస్థాయి కార్టూనిస్ట్ అవార్డు పొందిన శేఖర్‌రెడ్డిని గురువారం జిల్లా కేంద్రంలో సాహితి కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలుస శంకర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్య బలోపేతానికి కవులు, కళాకారులు వారి కళా నైపుణ్యంతో కృషి చేయాలని కోరారు. సాహితి కళావేదిక ప్రతినిధులు బైరోజు చంద్రశేఖర్, సేవ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి



అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ రవిబాబు కోరారు. పట్టణంలోని ఒకటో వార్డులోని పలు కాలనీల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. రాజావళి దర్గా వెనకాల ఏపుగా పెరిగిన ముళ్ల పొదలతో పాటు చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య కార్మికుల ద్వారా తొలగించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని కుళాయి నీటిని వృథా చేయకుండా.. తమ అవసరం మేరకు వినియోగించుకోవాలని సూచించారు.

పట్టణ సమస్యలు పరిష్కరించండి

వనపర్తి టౌన్: మున్సిపాలిటీలోని పుర వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని మున్సిపల్ కమిషన్ వెంకటేశ్వర్లుకు టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌పాష కోరారు. తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో కమిషన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఖాదర్‌పాష మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి పైప్‌లైన్లు లీకేజీ అవుతున్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలన్నారు.

పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితా సిద్ధం



సమావేశానికి హాజరైన వివిధ రాజకీయ పార్టీల నాయకులు

గోపాల్‌పేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశమై పోలింగ్ స్టేషన్లు, ఎంపీటీసీ స్థానాలు ఇతర వివరాలపై చర్చించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు. గోపాల్‌పేట మండలంలో గతంలో పదకొండు ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. ఏదుల కొత్త మండలం ఏర్పాటు కావడంతో రెండు ఎంపీటీసీ స్థానాలు తగ్గాయన్నారు. కార్యక్రమంలో శివన్న, కొంకి రమేష్, బాల్‌రాజు, మతీన్, నాగరాజు హాజరయ్యారు.